క్లుప్తంగా

బీమా పరిహారం అందించాలి

ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు



నాదెండ్ల: ఆత్మహత్యలతో సమస్యలు పరిష్కారం కావని, రైతులు మనోధైర్యంతో కష్టాలను అధిగమించి సాగు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. ఇటీవల నాదెండ్లలో ఆత్మహత్యలకు పాల్పడిన నాస్యం ఆదినారాయణ, ఉరుము వెంకటేశ్వర్లు కుటుంబాలను బుధవారం ఆయన పరామర్శించారు. ముందుగా ఇరువురు రైతులు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి సానుభూతి తెలిపారు. ప్రభుత్వం నుండి అందాల్సిన పరిహారపు సొమ్మును వీలైనంత త్వరలో అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. సర్పంచ్ ముసుగు శోభారాణి, తహశీల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీవో స్వరూపరాణి, ఏవో శ్రీలత, జనసేన ఇన్‌చార్జి తోట రాజారమేష్ పాల్గొన్నారు.

సర్పంచ్‌గా పాపసాని ప్రమాణ స్వీకారం



శావల్యాపురం: మండలంలోని ముండ్రువారిపాలెం గ్రామ సర్పంచ్‌గా నూతనంగా పాపసాని వెంకటేశ్వర్లు ప్రమాణ స్వీకార కార్యక్రమం ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ప్రమాణ స్వీకారం అనంతరం నూతన సర్పంచ్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ అభ్యున్నతితో తన శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. పంచాయతీ నిధులతో గ్రామంలో మౌలిక వసతులు ఏర్పాటు చేసి ప్రజలకు సుపరిపాలన అందిస్తామన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య, పంచాయతీ కార్యదర్శి ఉన్నారు.

కారుణ్య నియామకాలు వెంటనే చేపట్టాలి

ఏపీటీఎఫ్ నాయకుల డిమాండ్

యడ్లపాడు: కరోనా విపత్కర సమయంలో విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన ఉపాధ్యాయుల కుటుంబాలు మూడేళ్లుగా కారుణ్య నియామకాల కోసం పడిగాపులు పడుతుంటే, ప్రభుత్వం మాత్రం కనీసం స్పందించకపోవడం దారుణమని ఏపీటీజీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు బి సంపత్ బాబు, ప్రధాన కార్యదర్శి కె.కిషోర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాఠశాలలో విద్యార్థుల భవిష్యత్తు కోసం అహర్నిశలు కృషి చేసిన ఉపాధ్యాయుల కుటుంబాల పట్ల ఈ నిర్లక్ష్యం ఎందుకని, కారుణ్య నియామకాలను జరపకపోవడానికి కారణమేంటని వారు ప్రశ్నించారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోనే సుమారు 100 మంది ఉపాధ్యాయ కుటుంబాలు ఉద్యోగం లేక ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అసంబద్ధమైన నిబంధనలను తొలగించి, కలెక్టర్ పూల్ కారుణ్య నియామకాల ద్వారా అన్ని శాఖలలో వెంటనే నియామకాలు జరపాలని వారు డిమాండ్ చేశారు. ఈ విషయంలో ప్రభుత్వం స్పందించకపోతే, ఉద్యమానికి సిద్ధం కావాల్సి వస్తుందని ఏపీటీఎఫ్ నాయకులు హెచ్చరించారు.

ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించాలి

నరసరావుపేట: వచ్చేనెల ఏడున ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవాన్ని పండగ వాతావరణంలా గ్రామ గ్రామాన ఘనంగా నిర్వహించేందుకు అందరూ సమాయత్తం కావాలని ఆ సంస్థ నాయకులు పిలుపు ఇచ్చారు. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(ఎమ్మార్పీఎస్) నూతన కమిటీల పున నిర్మాణ ప్రక్రియలో భాగంగా బుధవారం వికలాంగుల నియోజకవర్గ అధ్యక్షులు కట్టెం పవన్‌కుమార్ ఆధ్వర్యంలో పట్టణంలోని రామిరెడ్డిపేట వికలాంగుల చైతన్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి జిల్లా కోఇన్‌చార్జి చిరుగూరి నాగరాజుమాదిగ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా జిల్లా నాయకులు దుడ్డు రామకృష్ణ మాదిగ, కనుమూరి కోటేశ్వరావు మాదిగ పాల్గొని మాట్లాడారు. నూతనంగా ఎన్నుకోబడే గ్రామ కమిటీలు పూర్తిస్థాయిలో మాదిగల సమాజం కోసం ముందుకు సాగాలని కోరారు. వికలాంగుల పట్టణ నాయకురాలు కామాక్షి, సురేష్, వెంకటరావు, రాజమ్మ, ఆంజనేయులు, బాబూరావు పాల్గొన్నారు.

ప్రతిభగల విద్యార్థులను ప్రోత్సహించాలి

చిలకలూరిపేట: ప్రతిభగల పేద విద్యార్థులను ప్రోత్సహించటం అభినందనీయమని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. శ్రీకృష్ణదేవరాయ విద్యా అభివృద్ధి కమిటీ, ఏపీ కాపు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలోని జంపని భాస్కర రావు సీనీ కల్యాణ మండపంలో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందించారు. ఈ సందర్భంగా పదో తరగతిలో 570 కి పైగా మార్కులు సాధించిన 15 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ. 5 వేలు చొప్పున నగదు పురస్కారాలు, దుస్తులు అందించారు. కార్యక్రమంలో నవతరం పార్టీ రావు సుబ్రమణ్యం, జనసేన పార్టీ ఇన్‌చార్జి తోట రాజా రమేష్, టీచర్స్ అసోసియేషన్ సభ్యుడు సీహెచ్ రమేష్ బాబు, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

గమ్మత్తుగా జీవితాలు పాడవుతాయి

- విద్యార్థులకు మత్తు పదార్థాల అనర్థాలపై అవగాహన కల్పించిన పోలీసులు
- వేర్వేరు ప్రాంతాల్లో అవగాహన సదస్సులు, ర్యాలీలు



నరసరావుపేటలో మాట్లాడుతున్న సీఐ హైమారావు



నాదెండ్లలో మాట్లాడుతున్న ఎస్సై పుల్లారావు



ఎన్ఈసీలో డ్రగ్స్ వద్దు బ్రో కార్యక్రమంలో డీఎస్పీ నాగేశ్వరరావు, సీఐ రామకృష్ణ

నరసరావుపేటటౌన్: మత్తు పదార్థాలకు అలవాటు పడి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని టూటౌన్ సీఐ హైమారావు సూచించారు. రెండవ పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం పీఎన్‌సీ అండ్ కేఆర్ కళాశాలలో మత్తు పదార్థాల నిర్మూలనపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు లోనై భవిష్యత్‌ను అంధకారంలోకి నెట్టుకోవద్దన్నారు. వాటి వ్యసనం వల్ల సమాజంలో పరపతి, ఆరోగ్యం, ధనం సర్వం కోల్పోతారన్నారు చట్టపరంగా కూడా పలు తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. మత్తు పదార్థాలు సేవించే వారిపై చట్టపరంగా ఉన్న నిబంధనలను వివరించారు. ఎవరైనా వాటిని వినియోగిస్తున్నట్లయితే పోలీసులు దృష్టికి తీసుకురావాలని, వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ఆయన తెలిపారు. విద్యార్థి దశలో కష్టపడి విద్యను అభ్యసించి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐలు హరిబాబు, లేఖ ప్రియాంక, కళాశాల సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

నాదెండ్ల: సాతులూరు గ్రామానికి చెందిన ఉప్పుటూరి లక్ష్మీనరసమ్మకు ముందస్తు చికిత్స కోసం సీఎం సహాయ నిధి నుంచి రూ.1.50 లక్షల ఎల్‌వోసీ కుటుంబ సభ్యులకు బుధవారం ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అందించారు. కార్యక్రమంలో నెల్లూరి సదాశివరావు, బండారుపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

మత్తుపదార్థాలకు యువత దూరంగా ఉండాలి

నాదెండ్ల: మద్యం, మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని, చక్కటి క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకుని జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగాలని ఎస్సై జి.పుల్లారావు చెప్పారు. గణపవరం సీఆర్ కళాశాలలో బుధవారం యాంటీ డ్రగ్స్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మద్యం, గంజాయి, డ్రగ్స్ లాంటి మత్తు పదార్థాలు జీవితాన్ని చిన్నాభిన్నం చేస్తాయన్నారు. సరదాగా మొదలైన అలవాటు వ్యసనంగా మారటంతో ఎంతోమంది భవిష్యత్‌ను కోల్పోయారన్నారు. విద్యార్థులు మాదక ద్రవ్యాల జోలికి వెళ్లకుండా చక్కగా చదువుకోవాలని కోరారు. అనంతరం మత్తు పదార్థాలు–సమాజానికి ముప్పు అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన వారికి ఈ నెల 25న బహుమతులు అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులు డ్రగ్స్ వద్దు బ్రో అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ మనోహర్, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ చుండి వేణుగోపాల్, డైరెక్టర్లు శ్రీఆర్యన్ ఆదిత్య, వైస్ ప్రిన్సిపల్ చైతన్య, నిరంజన్ పాల్గొన్నారు.

మాదకద్రవ్య రహిత సమాజాన్ని నిర్మిద్దాం

నరసరావుపేట రూరల్: మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే హానికర ప్రభావాలపై అవగాహన కల్పించేందుకు జిల్లా పోలీసులు చర్యలు చేపట్టారు. జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా పోలీసులు అవగాహన కార్యక్రమాలు బుధవారం నిర్వహించారు. మాదక ద్రవ్యాలు, గంజాయి వినియోగం వలన కలిగే అనర్థాలపై పాఠశాలలు, కళాశాలల్లో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ అవగాహన కార్యక్రమాల్లో విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలను భాగస్వాములను చేశారు. నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో డీఎస్పీ కె.నాగేశ్వరరావు, రూరల్ సీఐ రామకృష్ణ, ఎస్ఐ కిషోర్‌లు పాల్గొన్నారు. డ్రగ్స్ వద్దు బ్రో ప్లేకార్డులు ప్రదర్శించి విద్యార్థులకు అవగహన కల్పించారు. నరసరావుపేట వన్‌టౌన్ సీఐ చరణ్, అచ్చంపేట సీఐ అచ్చయ్యలు మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే దుష్పరిణామాలు, శారీరక మానసిక నష్టాలను తెలిపారు. కళాశాలల్లో విద్యార్థుల ప్రవర్తన, నడవడిక, చదువుపై ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. మీ పరిసరాల్లో గంజాయి, మాదక ద్రవ్యాలను ఎవరైన వినియోగించినా, విక్రయించినా సమాచారాన్ని సమీపంలోని పోలీసులకు, 1972 టోల్‌ఫ్రీ నెంబర్‌కు తెలియజేయాలని తెలిపారు.

మాదక ద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన

శావల్యాపురం: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల్లోని 9,10 తరగతి విద్యార్థులకు మాదక ద్రవ్యాల దుర్వినియోగం అక్రమ రవాణాపై వ్యాసరచన పోటీలు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై లేళ్ళ లోకేశ్వరరావు పాల్గొని మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. మత్తు పదార్థాలకు డ్రగ్స్, గంజాయి, కొకైన్ తదితర వస్నీ మానవ జీవితాలను నాశనం చేస్తాయన్నారు. ప్రాథమిక దశ నుంచి విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించటం ద్వారా భావిభారత పౌరులుగా ఎదుగుతారన్నారు. అనంతరం విద్యార్థులకు మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలుగు నష్టాల గురించి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బోడ్డపాటి విజయలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'కూటమి' కాపులకు అన్యాయం చేసింది

శావల్యాపురం: కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో కాపు వర్గీయులకు తీవ్ర అన్యాయం చేసిందని కాపు యువసేన అధ్యక్షులు కర్లా శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ ఏడాది పాలనలో కాపు కార్పొరేషన్ ద్వారా ఎంతమందికి రుణాలు ఇచ్చారని ప్రశ్నించారు. కాపుల ఓట్లతో అధికారంలోకి వచ్చి ప్రస్తుతం కాపులను చిన్నచూపు చూడటం హేయమైన చర్య అన్నారు. డిప్యూటీ సీఎం కొణిదల పవన్ కల్యాణ్ మోసపూరిత మాటలు నమ్మి కాపులు ఓట్లు వేశారని విమర్శించారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వానికి కాపులకు కాపు కార్పొరేషన్ రుణాలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఒక్కో కాపు మహిళకు సంవత్సరానికి రూ. 15 వేలు ఇచ్చిన ఘనత వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు.

నేటి నుంచి నట్టల నివారణ మందు పంపిణీ

శావల్యాపురం: మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో ఈనెల 26 నుంచి వచ్చే నెల 10 తేదీ వరకు జీవాలలో నట్టల నివారణ మందును ఉచితంగా అందజేస్తున్నట్లు పశువైద్యాధికారి పాలపర్తి గణేష్‌కుమార్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీవాలలో నట్టల బెడద ఒక్కోసారి ప్రాణాంతకంగా మారుతుందన్నారు. గొర్రెలు, మేకలు నట్టల నివారణ మందును షెడ్యూల్ ప్రకారం చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని జీవాల యజమానులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వేర్వేరుచోట్ల పొలం పిలుస్తోంది



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో హరిప్రసాద్

యడ్లపాడు: మండలంలోని కారుచోల, గుత్తావారిపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం జోరుగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎ.హరిప్రసాద్ ముఖ్యంగా పాల్గొని రైతులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. అధికారులు రైతులకు తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం పొందే మార్గాలపై సూచనలు ఇచ్చారు. గత సంవత్సరంలో పొగాకు పంటను వేసిన రైతులకు మద్దతు ధర లేక నష్టపోయారని గుర్తించి, ఈసారి ప్రభుత్వం స్వయంగా కొనుగోలు చేస్తున్నదని తెలిపారు. రైతులు తమ గ్రామాల్లోని రైతు సేవాకేంద్రాల వద్ద సీఎంయాప్ ద్వారా తప్పకుండా రిజిస్ట్రేషన్ చేసుకుని, యడ్లపాడు మండలంలోని మైదవోలు స్పైసెస్ పార్క్ వద్ద తమ పొగాకును విక్రయించాలని సూచించారు. ఇకపై పొగాకు పంటను వేయవద్దని కూడా అధికారులు హితవు పలికారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో పత్తి, మొక్కజొన్న, కందులు వంటి ప్రత్యామ్నాయ పంటల సాగుపై అధికారులు మెలకువలు, సేంద్రియ వ్యవసాయ ప్రయోజనాలను వివరించారు. విత్తనాలను లైసెన్స్ కలిగిన దుకాణాల నుంచే కొనుగోలు చేయాలని, పంట వేసిన వెంటనే ఈక్రాప్ నమోదు చేయించుకోవాలని సూచించారు. అలా చేస్తే మద్దతు ధరతోపాటు, ప్రభుత్వ కొనుగోలు అవకాశాలు కూడా లభిస్తాయని వివరించారు. ఈ సందర్భంగా అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ కోఆర్డినేటర్ డి.నరసింహరాజు మాట్లాడుతూ పత్తిపంటకు ఎకరాకు రూ.1900 ప్రీమియంగా చెల్లిస్తే, పంట నష్టానికి భద్రతగా ఇన్సూరెన్స్ అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో జీవన్ నాయక్, ప్రసన్నకుమార్, గ్రామ వ్యవసాయ సహాయకుడు హనుమంతరావు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

కౌలు రైతులు దరఖాస్తు చేసుకోండి

రొంపిచర్ల: కౌలు రైతులు అందరూ సీసీఆర్సీ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి శివలలిత అన్నారు. మండలంలోని కొత్తపల్లి గ్రామంలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యాక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. సీసీఆర్సీ కార్డుల వల్ల కౌలు రైతులకు వనగూరే ప్రయోజనాలు వివరించారు. గ్రామంలో సాగు చేస్తున్న వరి నారుమడులలో తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులు వివరించారు. విత్తన శుద్ధి తప్పనిసరి అన్నారు. ఈ కార్యక్రమంలో వీఏఏ వెంకటేష్, పలువురు రైతులు పాల్గొన్నారు.

పచ్చిరొట్టతో భూసారాన్ని పెంచుకోవాలి

నరసరావుపేట రూరల్: రసాయనిక ఎరువులు తగ్గించి పచ్చిరొట్ట ఎరువులను భూమిలో కలియదున్నడం వలన భూసారాన్ని పెంచుకోవచ్చని ఏడీఏ పి.మస్తానమ్మ తెలిపారు. మండలంలోని కొండకావూరు, పమిడిమర్రు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. పచ్చిరొట్ట ఎరువులు, పీఎండీఎస్ లోని 30 రకాల విత్తనాలను 45 రోజులకు భూమిలో కలియదున్నడం వలన భూసారం పెరగడంతో పాటు భూమి నీటిని నిలుపుకునే శక్తిని కలిగి ఉంటుందని తెలిపారు. ఏవో ఐ.శాంతి మాట్లాడుతూ కౌలుకు సాగు చేసే ప్రతి కౌలుదారు పంట సాగుదారుల హక్కు పత్రం కోసం గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని సూచించారు. ఉద్యానశాఖలో అమలవుతున్న పథకాలపై ఉద్యాన సహాయకుడు ఆంజనేయ ప్రసాద్ వివరించారు.



సమయానికి రావాలి

సిబ్బంది విధులకు సమయానికి ప్రతిఒక్కరూ హాజరు కావాలని, పై అధికారులు వీరి పర్యవేక్షణను జాగ్రత్తగా గమనించాలని, సిబ్బంది పనిదినాల్లో ఎక్కడ జాప్యం ఉండరాదని కలెక్టర్ పి.అరుణ్‌బాబు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని అన్ని సెక్షన్లను ఆయన తనిఖీ చేశారు. ఎవరెవరు.. ఏఏ సెక్షన్లలో ఏఏ విధంగా పనిచేస్తోంది సెక్షన్ అధికారి, సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆయా సెక్షన్లలో సరిపడినంత సిబ్బంది ఉన్నారా? అని ఆరా తీశారు. కలెక్టరేట్ వచ్చే ఫైళ్లు, సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కారం కావాలని, ప్రజాప్రతినిధులు, సాధారణ ప్రజలు పలు సమస్యలపై వస్తే వెంటనే వారి సమస్య పరిష్కారమయ్యేలా చూడాలని సూచించారు.

–నరసరావుపేట

ఇంజనీరింగ్ కార్మికులకు వేతనాలు పెంచాలి

- సమస్యలు పరిష్కరించకుంటే మెరుపు సమ్మెకు సిద్ధం
- సీఐటీయూ జిల్లా గౌరవ అధ్యక్షులు షేక్. సిలార్ మసూద్ హెచ్చరిక
- మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన
- సమస్యలు పరిష్కరించకుంటే మెరుపు సమ్మెకు సిద్ధం



నిరసన తెలియచేస్తున్న కార్మికులు, నాయకులు

నరసరావుపేట: జీఓ 36 ప్రకారం ఇంజనీరింగ్ కార్మికులకు వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా గౌరవ అధ్యక్షులు షేక్.సిలార్ మసూద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు బుధవారం మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిలార్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు తల్లికి వందనంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయాలని, 2023 డిసెంబర్ నెలలో చేపట్టిన 17 రోజుల సమ్మెకాలపు ఒప్పందాలకు జీఓ జారీ చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే జూలై నాలుగు తర్వాత ఏ క్షణంలోనైనా సమ్మెలోకి వెళతామని హెచ్చరించారు. ఆప్కాస్ రద్దు చేస్తే ప్రైవేట్ ఏజెన్సీలకు కార్మికుల జీవితాలను అప్పజెప్పకుండా కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలన్నారు. కారుణ్య నియామకాలు, రిటైర్ కార్మికుల పిల్లలు, కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి అమరారపు సాల్మన్ మాట్లాడుతూ శాఖ మంత్రి చొరవ చూపి కార్మికుల సమస్యలను పరిష్కారం చేయాలని, లేనిపక్షంలో సమ్మెబాట పడతామన్నారు. సమ్మె కు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిబాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఇంజినీరింగ్ కార్మికులకు రూ.15 వేలు జీతాలు చెల్లించడం అన్యాయమని ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీస వేతనాలు అమలు చేయాలని, ప్రమాద బీమా రూ.7 లక్షలకు పెంపు, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.75 వేలు, రూ.20 వేలు మట్టి ఖర్చులకు అందజేయాలన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావుకు వినతిపత్రం అందజేశారు. యూనియన్ ఇంజినీరింగ్ విభాగం పట్టణ అధ్యక్షుడు షేక్ చిన్న అల్లాబక్షు, నాయకులు సోమశేఖర్, కిరణ్, జి.సామ్రాజ్యం పాల్గొన్నారు.

అన్నవరంలో మలేరియాపై అవగాహన ర్యాలీ

రొంపిచర్ల: మండలంలో అన్నవరం గ్రామంలో బుధవారం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మలేరియా వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది, పాఠశాల విద్యార్థులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ''దోమలు కుట్టరాదు, దోమలు పుట్టరాదు'' అని నినాదాలు చేశారు. అదే విధంగా గ్రామంలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు వాటి లక్షణాలు గురించి అవగాహన కల్పించారు. వ్యాధుల నివారణకు తీసుకోవలసిన చర్యలు గురించి వివరించారు. అందరూ దోమ తెరలు వాడాలని అన్నారు. ఫ్రైడేను డ్రైడేగా పాటించాలని సూచించారు. అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ వెంకటేశ్వరరావు, సబ్ యూనిట్ ఆఫీసర్ కుంచాల శ్రీనివాసరావు, హెల్త్ సూపర్‌వైజర్ రామయ్య, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో విజిలెన్స్ తనిఖీలు

చిలకలూరిపేట: పురపాలక సంఘ కార్యాలయంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రేంజ్ ఆఫీసర్ షేక్ సైదులు ఆధ్వర్యంలో బుధవారం రికార్డుల తనిఖీలు నిర్వహించారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి సంబంధించి ఎంత నిధులు మంజూరయ్యాయి, ఎంత క్రీడా సామాగ్రి కొనుగోలు చేశారు, ఎన్ని రోజుల పాటు ఆటల పోటీలు నిర్వహించారు అని ఆరా తీశారు. వార్డు సచివాలయాల పరిధిలో ఆటల పోటీలు నిర్వహించిన నేపథ్యంలో వారంలోగా సచివాలయాల నుంచి వివరాలు సేకరించి అందజేస్తామని మున్సిపల్ సిబ్బంది వారికి సమాధానం చెప్పారు. తాము సూచించిన ఫార్మాట్‌లో వివరాలు అందజేయాలని విజిలెన్స్ అధికారి మున్సిపల్ సిబ్బందికి సూచించి వెళ్లిపోయారు.

ఇన్నర్ వీల్ క్లబ్‌కు సేవా పురస్కారాలు

చిలకలూరిపేట: ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేటకు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించినందుకు గాను బెస్ట్ ప్రెసిడెంట్ అవార్డుతో పాటు, మొత్తం 24 సేవా పురస్కారాలు లభించినట్లు క్లబ్ అధ్యక్షురాలు గట్టు సరోజిని బుధవారం తెలిపారు. ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన పురస్కారాల అందజేత కార్య క్రమంలో భాగంగా ఇన్నర్‌వీల్ డిస్ట్రిక్ట్ 315 చైర్మన్ ప్రేమలత ఈ అవార్డులను అందజేశారన్నారు. ఏడాది కాలంలో చేపట్టిన 103 సేవా కార్యక్రమాలను గుర్తించి అవార్డులు అందించారని చెప్పారు. విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాల కల్పన, వరదల సమయంలో అందించిన సహాయం, బాలికా విద్యకు అందిస్తున్న ప్రోత్సహం, మహిళాభ్యున్నతి చేస్తున్న కృషికి గాను అవార్డులు, ప్రశంసా పత్రాలు అందజేశారన్నారు. తనతో పాటు అవార్డులు స్వీకరించిన వారిలో కోలా విజయలక్ష్మి, జయలక్ష్మి ఉన్నారని వెల్లడించారు.

విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి

- రాష్ట్ర ఆహారకమిటీ చైర్మన్ విజయప్రతాప్‌రెడ్డి
- రెండు పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు



చీకటీగలపాలెంలో ప్రిన్సిపల్ విజయలక్ష్మిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రతాప్‌రెడ్డి

వినుకొండ: ప్రభుత్వ పాఠశాలల్లో మెనూప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ చిత్తా విజయ ప్రతాప్ రెడ్డి అన్నారు. వినుకొండ రూరల్ మండలం చీకటీగలపాలెం మోడల్ స్కూల్, వినుకొండ టౌన్‌లోని జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఆయన ఆకస్మిక తనిఖీలు చేశారు. మధ్యాహ్నం భోజనం సక్రమంగా ఉంటుందా? మెనూ ప్రకారం ఆహార పదార్థాలు అందుతున్నాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. చీకటీగలపాలెం మోడల్ స్కూల్లో నాలుగురకాల కూరలకు బదులు కేవలం దోసకాయ పచ్చడి మాత్రం ఉండటంతో ప్రిన్సిపల్ విజయలక్ష్మిని నిలదీశారు. ప్రతిరోజూ కోడిగుడ్డు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించగా పైనుంచి సరఫరా లేదని తెలిపారు. వెంటనే కాంట్రాక్టరుతో మాట్లాడి సక్రమంగా గుడ్లు సరఫరా చేయకపోతే కాంట్రాక్టు రద్దు చేస్తామని హెచ్చరించారు. వినుకొండలో భోజనవసతి పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులతో ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం రుచికరంగా ఉండేలా మెనూప్రకారం అందించాలని సూచించారు. పాఠశాల కమిటీ సభ్యుల సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానో పాధ్యాయులు, మధ్యాహ్న భోజన నిర్వాహకులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి

డీఎల్‌పీవో లక్ష్మణారావు



మతుకుమల్లిలో మాట్లాడుతున్న లక్ష్మణారావు

శావల్యాపురం: గ్రామ పంచాయతీల్లో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేలా పంచాతీయతీ కార్యదర్శులు బాధ్యత వహించాలని నరసరావుపేట డివిజనల్ పంచాయతీ అధికారి వి.వి.యం.లక్ష్మణారావు అన్నారు. బుధవారం మండలంలోని బొందిలిపాలెం, మతుకుమల్లి గ్రామ పంచాయతీలలో ఆకస్మిక పర్యటన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి ఐవీఆర్ ఫోన్ కాల్స్‌కు బొందిలిపాలెం గ్రామం ఎంపిక కావటం చేత గ్రామాన్ని ఉదయం 6 గంటలను సందర్శించి గ్రామంలో జరుగుతున్న శానిటేషన్ పనులను పరిశీలించినట్లు తెలిపారు గ్రామాల్లో శానిటేషన్ సిబ్బంది ఇంటింటి తిరిగి సేకరిస్తున్న తడి-పొడి చెత్త విధానాన్ని పరిశీలించి ఇంటి వారితో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బొందిలిపాలెం గ్రామంలో చెత్తా సంపద కేంద్రం పూర్తిస్థాయిలో వినియోగంలోకి వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. పంచాయతీలకు అదనపు ఆదాయం పెంపుదలకు చెత్తా సంపద కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

చెత్త సంపద కేంద్రాల పనిచేసే విధానాన్ని పరిశీలించడతో పాటు శానిటేషన్ సిబ్బందికి నెలవారీ వేతనం రూ. ప్రభుత్వం 6 వేలు పంచాయతీ నుంచి రూ.4 వేలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. తడి-పొడి చెత్త ద్వారా పంచాయతీలకు వర్మీకంపోస్టు ఎరువు తయారీ అయ్యేలా చూడాలన్నారు. ఆయనతో పాటు సర్పంచులు చింతా విజయ్‌కుమార్, యలగాల బసవయ్య, మాజీ సర్పంచ్ ముండ్రు హనుమంతరావు, ఈవోపీఆర్డీ పి.సుగుణ, పంచాయతీ కార్యదర్శి బాల పరమేశ్వరరావు ఉన్నారు.

చెత్తరహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలి



వివరాలు తెలుసుకుంటున్న డీపీవో

యడ్లపాడు: జిల్లాలోని ప్రతి పంచాయతీని చెత్తరహితంగా తీర్చిదిద్దేందుకు అధికారులతో పాటు ప్రజలు సహకరించాలని జిల్లా పంచాయతీ అధికారి నాగేశ్వరనాయక్ పేర్కొన్నారు. బుధవారం యడ్లపాడు మండలం వంకాయలపాడు గ్రామ పంచాయతీని ఆకస్మికంగా సందర్శించారు. ముందుగా గ్రామంలోని పలు వీధుల్లో తిరిగి పారిశుద్ధ్య నిర్వహణ గమనించారు. ఇళ్ల నుంచి వ్యర్థాల సేకరణ జరుగుతున్న తీరును స్థానిక ప్రజలను సైతం అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచి వాటర్ ట్యాంక్ వద్దకు చేరుకుని క్లోరినేషన్ పనుల్ని స్వయంగా చూశారు. చెత్త నుంచి సంపద కేంద్రానికి చేరుకుని తడిపొడి చెత్త విభజన ప్రక్రియ, వర్మీకంపోస్టు తయారీ విధానం తదితర అంశాల గురించి క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతిరోజు బ్లీచింగ్ క్లోరినేషన్ చేసి తర్వాతనే తాగునీటికి పంచాయతీ కుళాయిలకు విడుదల చేయాలని ఆదేశించారు. పల్లెల్లోని అన్ని వీధులు నిత్యం పరిశుభ్రంగా ఉండేలా పంచాయతీ అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. క్లాప్‌మిత్రలు ఇంటింటికి వెళ్లి నిత్యం చెత్త సేకరణ విధిగా చేయాలని చెప్పారు. ప్రజలు తమ ఇళ్లు, వ్యాపార దుకాణాల నుండి వెలువడే వ్యర్థాలను తడి, పొడి చెత్తలుగా వేరుచేసి క్లాప్‌మిత్రలకు అందజేయాలని కోరారు. అప్పుడే గ్రామీణ ప్రాంతాల్లో నివసించే ప్రజలు ఆరోగ్యవంతమైన జీవితాన్ని పొందే అవకాశం ఉంటుందన్నారు.

చిలకలూరిపేటలో వాహనాల తనిఖీ

చిలకలూరిపేట: వాహనదారులు తప్పనిసరిగా మోటారు వాహనాల చట్టం నిబంధనల ప్రకారం నడుచుకోవాలని రవాణాశాఖ సహాయ తనిఖీ అధికారి ఎం సురేష్‌బాబు చెప్పారు. రవాణాశాఖ, ఆర్టీసీ, పోలీసు శాఖల ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా 60 వాహనాలు తనిఖీ చేసి 12 వాహనాలపై ఇన్సూరెన్స్, పొల్యూషన్, హెల్మెట్ తదితర కారణాలతో కేసులు నమోదు చేసి రూ. 39,400 అపరాధ రుసుం, ఒక వాహనాన్ని సీజ్ చేసి ఆర్టీసీ డిపోకు తరలించారు.

ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో ఖరీఫ్ సాగు చేపట్టాలి



మాట్లాడుతున్న డీపీఎం అమలకుమారి

నరసరావుపేట రూరల్: ఖరీఫ్‌లో పంటల సాగును ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో చేపట్టాలని జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కె.అమలకుమారి తెలిపారు. జిల్లా ప్రకృతి వ్యవసాయ కార్యాలయంలో బుధవారం సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అమలకుమారి మాట్లాడుతూ ఖరీఫ్‌లో పత్తి పంట సాగు చేస్తున్న రైతులు పొలంలో ఘన జీవామృతాన్ని ఎకరానికి 500 కేజీలు చల్లాలని, బీజామృతంతో విత్తనశుద్ధి చేయడం వలన తెగుళ్ల బారి నుంచి పంటను కాపాడుకోవచ్చని తెలిపారు. జిల్లాలోని 118 గ్రామాల్లో 31,979 ఎకరాల విస్తీర్ణంలో ప్రకృతి వ్యవసాయ విధానాలను కొనసాగించేందుకు రైతులను సన్నద్ధం చేసినట్టు తెలిపారు. మిరప, వరి పంటలు సాగు చేసే రైతులకు 12 కేజీల పీఎండీఎస్ విత్తనాలను మహిళా సంఘాల ద్వారా తయారు చేసి రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు అందుబాటులో ఉంచుతామని వివరించారు. ఎటువంటి రసాయనాలు లేకుండా ఒక పంట వద్దు పలు పంటలు ముద్దు నినాదంతో ఏగ్రేడ్ మోడల్, ఏటీఎం మోడల్‌ను సిబ్బంది తమ భూముల్లో సాగు చేయాలని తెలిపారు.